Eenadu Dt- 01/07/15



మొక్కలు సిద్ధం



# సుందర స్టేషన్లు... నందన వనాలు

## ● రకరకాల మొక్కలు.. చెట్ల పెంపకం

న్యూస్‌టుడే, ఉప్పల్: మెట్రో రైలు స్టేషన్లను అధికారులు అందంగా తీర్చిదిద్దుతున్నారు. స్టేషన్ల కింద పోచంపల్లి చీరల డిజైన్‌తో టైళ్లను ఏర్పాటు చేశారు. రకరకాల మొక్కలు, చెట్లతో నందనవనంగా మారుస్తున్నారు. ఉప్పల్ రింగురోడ్డులోని స్టేషన్ పచ్చదనంతో సుందరంగా తయారైంది. ఒక్కొక్క స్టేషన్ దగ్గర తీరొక్క డిజైన్లతో సుందరీకరణ పనులను చేపడుతున్నారు. అదే తరహాలో పూల, ఇతర రకాల మొక్కలను నాటుతున్నారు.

## ఎర్రమట్టి.. సేంద్రియ ఎరువు

స్టేషన్ల కింద పలు రకాల జోన్లను ఏర్పాటు చేశారు. బస్సు, ఆటోల 'బే'లను స్టేషన్‌కు ఇరువైపులా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు సర్వీసు రోడ్లను అందుబాటులోకి తెచ్చారు. ఆటో, బస్సు బేలు, సర్వీసు రోడ్ల మధ్యలో ప్రత్యేక ఏర్పాట్లను చేసి పూల మొక్కలను, చెట్లను పెంచనున్నారు. ఎర్రటి మెత్తటి మట్టిలో సేంద్రియ ఎరువును పోసి పాదులుగా చేసి.. మొక్కలను, చెట్లను నాటుతున్నారు. వీటికి చుట్టూ హెచ్ఎంఆర్ మార్క్ కనిపించే డిజైన్లను అమర్చారు. స్టేషన్ పైనే కాకుండా కింద... అంటే పచ్చదనం పక్కన కూర్చొనేందుకు 'ప్లాంటర్ కం సీటింగ్' పేరుతో ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లో రచ్చబండలా తీర్చిదిద్దేందుకు పెద్దచెట్లను పెట్టి దాని కింద కూర్చొని సేద తీరేందుకు గ్రానైట్ సీటింగ్‌ను చేస్తున్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో: ఎన్వీఎస్‌రెడ్డి, ఎండీ, హెచ్ఎంఆర్

అంతర్జాతీయ ప్రమాణాలతో.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మెట్రో రైలు స్టేషన్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఉప్పల్ రింగురోడ్డులోని మెట్రో రైలు స్టేషన్‌ను జీఎం(వర్క్స్) రాజేశ్వర్, ఈఈ లక్ష్మితో కలిసి ఎన్వీఎస్‌రెడ్డి పరిశీలించారు. మొక్కల, చెట్ల నాటుట, టైళ్ల ఏర్పాటు ఇతర సుందరీకరణ పనులను పర్యవేక్షించారు. ఒక స్టేషన్ నిర్మాణానికి ఎల్ అండ్ టీ రూ.60 కోట్లను వెచ్చిస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. పెద్ద అంటే జాయింట్ స్టేషన్లకు రూ.150 కోట్లను ఖర్చు చేస్తుందన్నారు. ఇవి కాకుండా సుందరీకరణ, పచ్చదనానికి తెలంగాణ ప్రభుత్వం మరో రూ.కోటి ఇచ్చినట్లు పేర్కొన్నారు. సైకిల్, కారు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ సౌకర్యంతో పాటు బస్సులకు, ఆటోలకు ప్రత్యేకమైన బేలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రత్యేకమైన 'బే'ల ఏర్పాటుతో స్టేషన్ల వద్ద ట్రాఫిక్ కనిపించదన్నారు.



ఆకర్షణీయమైన పూల మొక్కలు